ప్రజాశక్తి

బుధవారం 1 ఫిబ్రవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సౌత్ కోస్ట్‌కు పునాదిరాయి పడేనా..?



విశాఖ రైల్వే స్టేషన్ (ఫైల్ ఫొటో)

- వాల్తేరు రైలు ప్రాజెక్టులు మళ్లీ పెండింగేనా ?
- పోలవరం ఊసు ఉంటుందా ?
- ఉద్యోగులకు ఊరటనిచ్చే పన్నుల మినహాయింపు లభించేనా ?
- కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఊరిస్తున్న ఆశలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర బడ్జెట్ 2023-24పై విశాఖ ప్రాంత ప్రజానీకంలో ఆసక్తి నెలకొంది. ఎన్నో ఆశలు వారిని ఊరిస్తున్నాయి. కేంద్రంలోని బిజెపి సర్కారు బుధవారం పార్లమెంట్‌లో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ పెట్టబోతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా ఈ ప్రాంతానికి కేంద్రం నూతన రైల్వే జోన్‌ను ప్రకటించింది. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అంటూ మూడేళ్లుగా హడావుడి చేసిందే తప్ప పునాది రాయి కూడా పడలేదు. ఇంకా ప్రారంభోత్సవం సంగతి కేంద్ర పాలకులకే తెలియాలి. విశాఖ కేంద్రంగా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఒఎస్‌డి) అధికారిని కూడా 2017లోనే దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనుల నిర్వహణకు కేటాయించినా పైసా పని జరగలేదు. మరో వైపు దేశంలోనే అధిక ఆదాయార్జన తెచ్చే డివిజన్‌లలో ఒకటైన వాల్తేరు రైల్వే డివిజన్‌ను బిజెపి సర్కారు అనాలోచితంగా ఎత్తేసి ఈ ప్రాంతానికి అన్యాయం చేసింది. డివిజన్ లేని రైల్వే జోన్ అంటే 'తల లేని మొండెం'తో సమానమంటూ సిపిఎం, వామపక్షాలు ఆందోళనలు చేసినా మోడీ సర్కారు కనీస స్థాయిలో దీనిపై పునరాలోచన చేయలేదంటే ఈ ప్రాంత అభివృద్ధిని కుంటుపరచాలనే వ్యూహం తప్ప మరొకటి లేదు. మరో వైపు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినా ఆ దిశగా నిధుల కేటాయింపు, పనులు జరగడం లేదు. ఇది పూర్తయితే విశాఖ నగరానికి తాగునీటి సమస్య తీరనుంది. పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్ ఆమోదంపైనా కేంద్రం సరైన నిర్ణయం, విధానం తీసుకోకపోవడం ఒక పెద్ద వైఫల్యంగానే చెప్పొచ్చు.

అతీగతి లేని రైల్వే లైన్ ప్రాజెక్టులు

ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష అయినటువంటి విశాఖ కేంద్రంగా నూతన రైల్వే జోన్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాన్చుతూనే వస్తోంది. ఈ బడ్జెట్‌లోనైనా పనుల కోసం నిధులు కేటాయించి ఫౌండేషన్ స్టోన్ పడుతుందా ? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. వాల్తేరు రైల్వే పరిధిలోని నౌపాడ-గుణుపూర్ లైన్ ఉంది. గుణుపూర్ నుంచి తెరుబలి వరకూ కొత్తగా ట్రాక్ (లైన్ పనులు) జరగాల్సి ఉంది. దీనికోసం రూ.1500 కోట్లు అంచనా వేశారు. ఈ బడ్జెట్‌లో వస్తాయని రైల్వే అధికారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జైపూర్-మల్కన్‌గిరి, అలాగే మల్కన్‌గిరి-భద్రాచలం ఒక లైన్ పెండింగులో ఉంది. కేంద్రం ప్రకటన చేసినా పనుల కోసం ఒక్కపైసా రాలేదు. విజయనగరం- టిట్లాగర్ 3వ లైన్‌కి నిధులు రూ.2500 కోట్లు అవసరం. పనులు మిగతా 2లో..



జివిఎంసి వద్ద ఆందోళనకు దిగిన సిపిఎం, సిపిఐ నేతలు

పూర్ణా మార్కెట్, ముడసర్లోవ

ప్రయివేటుకొద్దు

- ప్రతిపాదన విరమించుకోవాలని జివిఎంసి వద్ద సిపిఎం, సిపిఐ ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పిపిపి పేరుతో పూర్ణామార్కెట్, ముడసర్లోవ భూములను వైసిపి అనుయాయులకు అప్పగించే ప్రతిపాదనలను తక్షణమే విరమించుకోవాలని సిపిఎం, సిపిఐ జివిఎంసి పాలకవర్గాన్ని డిమాండ్ చేశాయి. బుధవారం జరిగే జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో వైసిపి పాలకవర్గ నిర్ణయాలను అన్ని రాజకీయపార్టీల కార్పొరేటర్లు ముక్తకంఠంతో వ్యతిరేకించి, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కాపాడాలని కార్పొరేటర్లకు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, ఎం.పైడిరాజులు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆస్తులను పిపిపి పేర ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే చర్యలు వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే జివిఎంసి పరిధిలో ఉండే విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడానికి వైసిపి అగ్రనాయకులు తీవ్ర ప్రయత్నాలు మిగతా 2లో..

పటిష్ట ఉన్నత విద్యా వ్యవస్థతో దేశ అభ్యున్నతి సాధ్యం

వార్త మెయిన్‌లో..

ఎంవిపి రైతు బజార్‌పై నీలినీడలు

వార్త 8లో..

స్టీల్‌ప్లాంట్‌తోనే విశాఖ భవిష్యత్తు

వార్త 2లో..

జిఎంఎఫ్‌సి ప్రమాదంపై విచారణ జరపాలి

- మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి
- సిపిఎం, సిఐటియు డిమాండ్



కంపెనీ ఎదుట ఆందోళనకు దిగిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి - అనకాపల్లి : అచ్యుతాపురం సెజ్‌లోని జిఎంఎఫ్‌సి ల్యాబ్‌లో మంగళవారం రియాక్టర్ పేలుడు ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. రియాక్టర్ పేలిన ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరంకు చెందిన సిహెచ్.రామారావు అక్కడికక్కడే మృతిచెందాడని, కె.కృష్ణంరాజు, ప్రభాకర్ జా, వి.సుబ్బరాజు తీవ్ర గాయాలపాలయ్యారని తెలిపారు. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. మృతి చెందిన రామారావు కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని, గాయాలైన కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందన్నారు. ఫార్మా కంపెనీల్లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం మిగతా 2లో..

లెక్కలేనితనం

- సిఆర్‌జెడ్‌లో హెటిరో డీశాలినేషన్ ప్లాంట్
- కళ్లు మూసుకున్న కాలుష్య నియంత్రణ మండలి
- 15 ఏళ్లుగా పట్టించుకోని వైనం



హెటిరో నిర్మించిన డీశాలినేషన్ ప్లాంట్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

పలుకుబడికి డబ్బు, హోదా తోడైతే నిబంధనలను పక్కనపెట్టి ముందుకెలా దూసుకుపోవచ్చో, తమ జోలికిరాకుండా ప్రభుత్వ వ్యవస్థలను ఎలా నియంత్రించవచ్చో, శాసించవచ్చో హెటిరో డ్రగ్స్ కంపెనీ చేష్టలుచూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. దాదాపు దశాబ్దమున్నర కాలంగా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సిఆర్‌జెడ్) నిబంధనలకు విరుద్ధంగా సిఆర్‌జెడ్ పరిధిలో నిర్మించిన డీశాలినేషన్ ప్లాంట్‌పై ఇంతవరకూ సంబంధిత అధికారులు పల్లెత్తుమాట మాట్లాడలేదంటే హెటిరో గ్రూఫ్ ఛైర్మన్ పార్థసారధి ఎంతటి శక్తివంతమైన వ్యక్తో అర్థంచేసుకోవచ్చు. ప్రభుత్వాలెన్ని మారినా, అధికారులెవరొచ్చినా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న డీశాలినేషన్ ప్లాంట్ దరిదాపులకు వెళ్లలేకపోయారన్న విమర్శ బలంగా వినిపిస్తోంది. నక్కపల్లి మండలం రాజయ్యపేట సముద్రపు ఒడ్డుకు అతిసమీపంలో డీశాలినేషన్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి ఉప్పునీటిని శుద్ధి చేసి కంపెనీకి అవసరమైన నీటిని హెటిరో డ్రగ్స్ ఉపయోగించుకుంటోంది. సిఆర్‌జెడ్ పరిధిలో కాకుండా సాధారణ ప్రదేశంలో డీశాలినేషన్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ డైరెక్టర్ అనుమతి ఇచ్చింది.

పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి వచ్చిన అనుమతులను పక్కనబెట్టిన హెటిరో యాజమాన్యం... సిఆర్‌జెడ్ పరిధిలో మూడు డీశాలినేషన్ ప్లాంట్లను నిర్మించింది. సిఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం దాని పరిధిలో ఎటువంటి నిర్మాణాలూ చేపట్టకూడదు. చేపట్టినా వాటిని తొలగించాల్సివుంది. కానీ పదిహేనేళ్లుగా యథాతథంగా డీశాలినేషన్ ప్లాంట్ కొనసాగుతున్నా ఎపి కాలుష్య నియంత్రణ మండలి అధికారులెవరూ అభ్యంతరం చెప్పిన పాపానపోలేదు. సిఆర్‌జెడ్ పరిధిలోనివున్న డీశాలినేషన్ ప్లాంట్లను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పర్యవేక్షించలేదా ? పరిశీలించినా చేతివాటం ప్రదర్శించి కళ్లు మూసుకొని మౌనం మిగతా 2లో..



దీక్షా శిబిరంలో నినదిస్తున్న పెన్షనర్లు

స్టీల్‌ప్లాంట్‌తోనే విశాఖ భవిష్యత్తు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా ఉంటే విశాఖ నగర భవిష్యత్తుకు డోకా ఉండదని, ఒకవేళ ప్రైవేటుపరమైతే నగరానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 670వ రోజుకు చేరాయి. దీక్షల్లో అసోసియేషన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని గుర్తించకుండా కేంద్రంలోని బిజెపి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం, ఆ దిశగా అన్ని ఏర్పాట్లు చేస్తుండడం దుర్మార్గమన్నారు. దేశంలో మిగిలిన స్టీల్ ప్లాంట్లకూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కూ ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ విశాఖలో ఏర్పాటైందన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్ ఇదొక్కటేనన్నారు. దీనిని ప్రైవేట్‌పరం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతామని స్పష్టం చేశారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో వై.అప్పారావు, రమణ, రాంప్రభు, సిఎన్.రావు, డి.విజ్ఞానంద్, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, వి.తులసీరామ్, కెఎం.కుమార మంగళం ఉన్నారు.

విశాఖలో రైటర్ చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : లైబ్రరీలో పని చేసే ఒక మధ్య తరగతి యువకుడు రచయిత అవ్వాలనుకోడమే 'రైటర్' చిత్ర కథ అని ఆ చిత్ర కథానాయకుడు సుహాస్ తెలిపారు. చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ పతాకంపై నిర్మించిన రైటర్ చిత్ర యూనిట్ మంగళవారం నగరంలోని ఒక హోటల్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. కథానాయకుడు సుహాస్ మాట్లాడుతూ రైటర్ సినిమా ఈ నెల 3న విడుదల అవుతుందన్నారు. విజయవాడ, గుంటూరు, కాకినాడ, భీమవరం, విశాఖ ప్రాంతాల్లో ప్రీమియర్ షోలకు మంచి స్పందన వస్తోందన్నారు. కలర్ ఫొటో సినిమా నచ్చిన వాళ్లకు ఈ సినిమా కూడా నచ్చుతుందన్నారు. హీరోయిన్ టీనా శిల్పరాజ్ మాట్లాడుతూ ఇది తన తొలి సినిమా అన్నారు. ఈ చిత్రంతో తనకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. హీరోయిన్ గౌరీ ప్రియ మాట్లాడుతూ ఇది మంచి కథా చిత్రమని, వినోదాత్మకంగా వుంటుందని అన్నారు. నిర్మాతలు అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర మాట్లాడుతూ కుటుంబ సమేతంగా చూసే సినిమా ఇది అన్నారు. రోహిణి, ఆశిష్ విద్యార్థి వంటి సీనియర్ నటులు ఇందులో వున్నారని తెలిపారు. దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ మాట్లాడుతూ కొత్త నటీనటులతో సినిమా తీసామని చెప్పారు. లహరి మ్యూజిక్ సంస్థ ద్వారా ఆడియో విడుదల చేస్తున్నామన్నారు. అనంతరం ఐనాక్స్ థియేటర్‌లో ప్రీమియర్ షో ప్రదర్శించారు.

ఇపిడిసిఎల్ డైరెక్టర్‌గా రమేష్‌ప్రసాద్ కొనసాగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఇపిడిసిఎల్) ఆపరేషన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రమేష్‌ప్రసాద్ ఉద్యోగ కాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2020 నుంచి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన సేవలను గుర్తించి వచ్చే ఏడాది జనవరి వరకు కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. డైరెక్టర్‌గా పదవీకాలం పెంచడంతో రమేష్‌ప్రసాద్‌ను సంస్థ అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు అభినందించారు.



రమేష్ ప్రసాద్

సుజల స్రవంతి భూసేకరణ అధికారిగా రమామణి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూ సేకరణ అధికారిగా కె.రమామణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారిని కలిసి తరువాత ఆర్‌డిఓ కార్యాలయంపైనున్న తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

మొదటి పేజీ తరువాయి..

సౌత్ కోస్ట్‌కు పునాదిరాయి పడేనా..?

నడుస్తున్నాయి. సుమారు 360 కిలోమీటర్ల లైన్ పనుల కోసం పై నిధుల ప్రతిపాదనను ఈ కేంద్ర బడ్జెట్ స్వీకరిస్తుందా ? అన్నది చూడాల్సిందే.

స్కీం వర్కర్ల సమస్యలు

మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు రూ.10 వేలు లేదా రూ.11 వేలు దాటడం లేదు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్న డిమాండ్ దేశ వ్యాపితంగా ఉంది. స్కీం వర్కర్ల తరపున సిఐటియు పోరాడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో కనీస వేతనానికి కేంద్ర బడ్జెట్‌లో పాలకులు చర్యలు చేపడతారా ? లేదా ? అన్నది చూడాల్సిందే.

ప్రత్యక్ష పన్నుల భారం తగ్గేనా..

ఇటీవల కాలంలో దేశంలోని కోట్ల మంది ఉద్యోగుల జీత, భత్యాల అంశం చర్చనీయాంశమైంది. వీరికి జిఎస్‌టి, ఆదాయ పన్నుల భారం లేకుండా ఉంటే మార్కెట్‌లోకి అదనంగా డబ్బు పారుతుందన్నది దీని సారాంశం. కేంద్రం ఏమైనా కనికరిస్తుందా? చూడాల్సిందే. అంతేగాక ప్రపంచం తాజాగా ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం తాకిడి మన దేశానికి తగలకుండా ఉండాలంటే ఆదాయపు పన్ను పరిమితిని పెంపుదల చేయడం, రియల్ ఎస్టేట్, హౌసింగ్ రంగంలో పన్నులు తగ్గించడం చేస్తే.. ఉద్యోగుల ఖర్చు వీటిపై చేస్తారని, మౌలిక వసతుల రంగం, యువతకు ఉపాధి కూడా తద్వారా పెరుగుతుందనే చర్చ దేశంలో జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా డైరెక్ట్ ట్యాక్స్‌ల భారాన్ని తగ్గిస్తుందని ఉద్యోగులంతా ఎదురు చూస్తున్నారు.

ఉదాహరణకు ఒక ఉద్యోగికి రూ.15 వేలు మేర ఒక నెలకు పన్నులు తగ్గితే ఇదంతా మార్కెట్‌లోకి వచ్చి ఇతర రంగాల అభివృద్ధికి తోడ్పడుతుందన్న ప్రచారం జరుగుతోంది. లేదంటే ఒక నెల జీతాన్ని ఏటా పన్నుల భారంగా మోయాల్సి వస్తుందని, దీనివల్ల మార్కెట్ అభివృద్ధి జరగదన్నది తెలుస్తోంది.

లెక్కలేనితనం

దాల్చుతున్నారా ? అన్న అనుమానాలు, ప్రశ్నలు వినబడుతున్నాయి. హెటిరో గ్రూపు ఛైర్మన్ పార్థసారధి టిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు కావడంతో ఆయన రాజకీయ పలుకుబడి ముందు నిలబడలేమన్న భయంతో ఏం చేసినా చూసీచూడనట్లు అధికారులు పోతున్నారు. రెండో పైప్‌లైన్‌కు సిఆర్‌జెడ్ నుంచి అనుమతులురాకముందే యాజమాన్యం పైప్‌లైన్ వేయడం ప్రారంభించింది. కాలుష్య నియంత్రణ మండలికి కనీస సమాచారం కూడా ఆనాడు లేదని అధికారులు తెలిపారు. తమ జీవనోపాధిని దెబ్బతీసే రెండో పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న పోరాటంతో ఆ పైప్‌లైన్‌ను గతంలో కొంతమేరకు హెటిరో తొలగించింది. హెటిరో పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడినట్లు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) నియమించిన జాయింట్ కమిటీ... తన నివేదికలో పర్యావరణ నష్టానికి రూ.6.94 కోట్లు అపరాధ రుసుము విధించాలని సిఫార్సు చేసింది. పర్యావరణ, సిఆర్‌జెడ్‌లో డీశాలినేషన్ ప్లాంట్ నిర్మాణ ఉల్లంఘనలు కొనసాగుతుండగానే, వాటిని పరిశీలించి సరిచేయాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయకపోగా రెండో పైప్‌లైన్‌కు అనుమతులిచ్చింది. డీశాలినేషన్ ప్లాంట్ సిఆర్‌జెడ్ పరిధిలోవున్న విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు వద్ద ఫోన్లో ప్రస్తావించగా డీశాలినేషన్ ప్లాంట్ సిఆర్‌జెడ్ పరిధిలో నిర్మించకూడదన్నారు. కొత్తగా వచ్చినందున సిఆర్‌జెడ్‌లో వుందీ, లేనిదీ, దీని అనుమతులు రికార్డులు పరిశీలిస్తానన్నారు. ఇదే విషయమై హెటిరో కంపెనీ ప్రతినిధి సుబ్బారెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ డీశాలినేషన్ ప్లాంట్ పూర్తిగా సిఆర్‌జెడ్ పరిధిలో వున్నప్పటికీ, కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ నుంచి 2013లో పర్మిషన్ లెటర్ వచ్చిందన్నారు. ఫెనాల్టీ కట్టుకొని సిఆర్‌జెడ్ పరిధిలోని డీశాలినేషన్ ప్లాంట్‌ను రెగ్యులరైజ్ చేసుకుంటామన్నారు.

పంచాయతీ అనుమతి ఇవ్వలేదు

రెండో పైపులైన్‌కు పంచాయతీ తీర్మానమడిగినా ఇవ్వలేదు. హెటిరో కంపెనీ నష్టం తెలిసి ముందు నుంచీ వ్యతిరేకిస్తున్నాం. కంపెనీ శక్తి ముందు మా శక్తి చాలక అడ్డుకోలేకపోతున్నాం. రెండో పైప్‌లైన్ వేస్తే ఎదుర్కొంటాం.

పిక్కి కామేశ్వరరావు, 7వ వార్డు మెంబరు, రాజయ్యపేట

వేటలేక వలసెల్లిపోతున్నాం

గతంలో రోజుకు ఒకసారి వేటకు వెళితే వారానికి రెండు, మూడువేలు వచ్చేవి. ఇప్పుడు రోజుకు రెండుసార్లు వేటకు వెళ్తున్నా వారానికి వెయ్యి రూపాయలు కూడా రాకపోవడంతో వలస వెళ్లిపోతున్నాం. రెండో పైప్‌లైన్ వేస్తే ఉన్న కొద్దిపాటి చేపల వేటా పోతుంది.

కారే దేముడు, వలస మత్స్యకారుడు

ప్రయివేటుకొద్దు

చేశారన్నారు. ఇంకా మిగిలి ఉన్న జివిఎంసి ఆస్తులను పిపిపి పేరుతో వైసిపి ప్రభుత్వ పెద్దలు కాజేయాలని కుట్రపన్నారన్నారు. అందులో భాగంగానే నేడు సర్దార్ వల్లభాయ్ పటేల్ (పూర్ణామార్కెట్), ముడసర్లోవ పార్కుల 283 ఎకరాల భూములను పిపిపి కింద ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాలని కౌన్సిల్‌లో అజెండా పెట్టి తీర్మానం చేయబోతున్నారన్నారు.

దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా సమూహంలోకి వెళ్లి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికే యూజర్ ఛార్జీల పేరుతో ప్రజలపై అన్యాయంగా వేసిన చెత్త, ఆస్తి పన్నులు రద్దు చేయాలని కోరారు. జి-20 దేశాల గ్లోబల్ సమ్మిట్ పనులకు జివిఎంసి నుంచి రూ.100 కోట్ల నిధులు కేటాయించే ప్రతిపాదనలను విరమించాలన్నారు. విశాఖ ప్రజల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ముడసర్లోవ ప్రాంతంలోని జివిఎంసి స్థలం 283.02 ఎకరాలు సుమారు రూ.5 వేల కోట్లు విలువైనదన్నారు. ఆధునీకరణకు రూ.50 కోట్లు వెచ్చించి, చుట్టూ ప్రహరీగోడ నిర్మాణానికి రూ.15 కోట్లు జివిఎంసి నిధులు ఖర్చు చేస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తిని దోచిపెట్టడం తప్ప మరొకటి కాదన్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

ప్రఖ్యాతిగాంచిన పూర్ణామార్కెట్‌లో జివిఎంసి లెక్కలు ప్రకారమే సుమారు 430 పర్మినెంటు దుకాణాలు, 200 తాత్కాలిక దుకాణాలు ఉన్నాయన్నారు. చిరు వ్యాపారులు సుమారు 650 మంది వున్నారన్నారు. 1.35 ఎకరాల విస్తీర్ణంలో ఈ మార్కెట్ వుందన్నారు. పిపిపి మోడల్‌లో దీనిని అభివృద్ధి చేస్తామని ప్రతిపాదనలు చేసారని, దీని వల్ల వందల మందికి ఉపాధి పోతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహ్మాన్, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, సిపిఎం, సిపిఐ నాయకులు బి.జగన్, ఎం.సుబ్బారావు, పి.మణి, బి.వెంకటరావు, ఎస్.మురళి, ఎంఎ.బేగం, ఎ.దేముడమ్మ, జి.జయ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన..

పూర్ణా మార్కెట్, ముడసర్లోవ పార్కులను వైసిపి నాయకుల పరం కాకుండా కాపాడుకుంటామని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, పార్లమెంట్ నియోజవర్గం సమన్వయకర్త ఎం.శ్రీ భరత్ అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జీ, భీమిలి నియోజవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, చిక్కాల విజయ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జిఎంఎఫ్‌సి ప్రమాదంపై విచారణ జరపాలి

పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. పరిశ్రమలపై పర్యవేక్షణ చేయాల్సిన ఫ్యాక్టరీ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, కార్మిక శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. దీన్ని అలుసుగా చేసుకుని ఫార్మా కంపెనీల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పాటించకుండా వ్యవహరిస్తున్నాయన్నారు. దీని కారణంగా కార్మికుల విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని, ఈ దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

కంపెనీ గేటు ముందు ధర్నా

ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, బాధితులకు న్యాయం చేయాలని జిఎమ్ఎఫ్‌సి ల్యాబ్ గేటు వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము, అచ్యుతాపురం మండల కార్యదర్శి కె.సోమినాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శ

జిఎమ్ఎఫ్‌సి ల్యాబ్‌లో గాయపడి బెనర్జీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, కోశాధికారి వివి.శ్రీనివాసరావు, ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

న్యాయ విచారణ జరపాలి: హెచ్‌ఆర్‌ఎఫ్

జిఎమ్ఎఫ్‌సి ల్యాబ్‌లో జరిగిన ప్రమాదంపై సమగ్రమైన న్యాయవిచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పి.రఘు డిమాండ్ చేశారు. అంతవరకు ఎస్‌ఇజెడ్‌లో కార్యకలాపాలు నిలిపివేయాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధి ఏదీ?

మండల సమావేశంలో సర్పంచులు

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టకుండా ప్రజల వద్దకు వెళ్లి ముఖం చూపించలేకపోతున్నామని మండల సమావేశంలో సర్పంచులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక ఆధ్వర్యాన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా పలు శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, పనులపై మాట్లాడుతుండగా తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు అడ్డుతగిలి మాట్లాడారు. మూడేళ్లుగా గ్రామపంచాయతీలో తాగు నీటి కుళాయిలు, రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అందిస్తున్నా గ్రామాల అభివృద్ధి మాత్రం జరగడంలేదన్నారు. భీమన్నదొరపాలెం సర్పంచ్ బంటుకుమారి చిన్న మాట్లాడుతూ, బంటుమెరకలోని తాగు నీటి ట్యాంకు కూలడానికి సిద్ధంగా ఉందని, దీనిపై అనేకసార్లు ఫిర్యాదులు చేసినా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. పంచాయతీల్లో అనేక సమస్యలు ఉన్నాయని, అధికార పార్టీ నాయకులే పరిష్కరించలేకుంటే ఏ ముఖం పెట్టుకొని గ్రామాల్లో తిరుగుతామని ఆవేదన వ్యక్తంచేశారు. పాలవలస సర్పంచ్ నాగోజు అచ్చియమ్మ నరసమ్మ మాట్లాడుతూ, అంగన్‌వాడీ భవనం కూలడానికి సిద్ధంగా ఉందని, దీనిపై అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. బీపీ కల్లాలు సర్పంచ్ కోన పైడిరాజు శ్రీను మాట్లాడుతూ, పంచాయతీలో ఇచ్చిన జగనన్న కాలనీ స్థలం ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేదని, వేరే చోటకు మార్చాలని కోరారు.

'గడపగడప' సమస్యలను పరిష్కరించాలి : ముత్తంశెట్టి

మండల సర్వ సభ్యసమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను ఉగాది లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మూడున్నరేళ్లలో భీమిలి నియోజకవర్గంలో రూ.1200 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. త్వరలోనే విశాఖ నుంచి పాలన సాగుతుందని ముఖ్యమంత్రి చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ చైర్మన్ భువన అప్పలనాయుడు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, బోట్ట ధనలక్ష్మి, ఎంపిడిఒ లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, నాయకులు నారాయణ, మజ్జి వెంకట్రావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.



గ్రామాల అభివృద్ధిపై నిలదీస్తున్న సర్పంచులు

ఉగాది నాటికి ఇళ్లు : ముత్తంశెట్టి



టిడిపి ఎంపిటిసి రమణ, వైసిపి సర్పంచి సూర్యనారాయణ మధ్య వాగ్వావాదం

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఉగాది నాటికి జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు అధ్యక్షతన స్థానిక ఎండిఒ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సభ్యుల సాధారణ సమావేశం నిర్వహించారు. రెండేళ్ల క్రితం మంజూరైన ఇళ్లను రద్దు చేశారని అన్నవరం ఎంపిటిసి సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తన దృష్టిలో లేకుండా ఏ ఒక్క ఇళ్లూ రద్దు చేయెుద్దని గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశించారు. దీనిపై గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.హుస్సేన్ బదులిస్తూ తమ పరిశీలనలో అన్నవరం గ్రామంలో స్థానికంగా నివాసం లేరని తేలిన తర్వాతనే కొన్ని ఇళ్లను రద్దు చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో రాత్రింబవళ్ళు పడి గాపులు కాయడం వల్ల ట్రాక్టర్ అద్దెలు రెట్టింపు చెల్లించాల్సి వస్తుందని దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు సభలో ప్రస్తావించారు. దీంతో అనివార్యంగా మిల్లర్ల వైపు వెళ్లేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. దీనిపై మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివ కోమలి బదులిస్తూ పౌర సరఫరాల శాఖ అధికారుల సమన్వయ లోపం వల్ల ఇలా జరుగుతుందని అన్నారు.

వైసిపి సమావేశమా? మండల సమావేశమా?

టిడిపికి చెందిన తాళ్లవలస ఎంపిటిసి సభ్యులు కోరాడ రమణ మాట్లాడుతూ, ఎంపిటిసి సభ్యులకు బదులుగా వైసిపి నాయకులు సమావేశంలో పాల్గొనడం చూస్తుంటే, ఇది మండల సమావేశమా? లేదా వైసిపి నాయకుల సమావేశమా? అన్న అనుమానం కలుగుతోందని అన్నారు. ప్రోటోకాల్ ఉల్లంఘన జరుగుతుందని విమర్శించారు. దీనిపై కోరాడ రమణతో మజ్జిపేట ఎంపిటిసి సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, నారాయణరాజుపేట సర్పంచ్ కాద సూర్యనారాయణ వాగ్వివాదానికి దిగారు. ప్రోటోకాల్ గురించి మాట్లాడే అర్హత టిడిపికి లేదన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పొలంబడిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బోనిలో పొలంబడి పరిశీలన

ప్రజాశక్తి-ఆనందపురం : బోని గ్రామ పంచాయతీలో పొలంబడిని గుంటూరు నుంచి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు డి.లక్ష్మణబాబు మంగళవారం పరిశీలించారు. మేలైన యాజమాన్య పద్ధతులు - పొలంబడి కార్యక్రమంలో ఎంపిక చేసిన 122 మంది రైతులు, 250 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలో ఆచరిస్తున్న మేలైన యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు పొలంబడిలో నేర్చుకుంటున్న పర్యావరణ పరిశీలన, పంట సస్యరక్షణలో రైతుల నిర్ణయాధికారాన్ని పరిశీలించారు. గ్రామంలోని పొలంబడులలో రైతులతో కలిసి సందర్శించి, వారు పాటిస్తున్న పద్ధతుల తెలుసుకుని, నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, ఎడిఎలు లక్ష్మణబాబు, సిహెచ్.సుబ్రమణ్యం, బి.విజయ్‌ప్రసాద్, వ్యవసాయాధికారి సంధ్యా రత్నప్రభ, సర్పంచ్ బోని అప్పలకొండ, సన్యాసినాయుడు, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ, వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, స్థానిక విఎఎలు, విహెచ్ఎలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు షోకాజు నోటీసు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇసుకతోట జివిఎంసి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని కొండ, ప్రధానోపాధ్యాయులు జి.నాగమణికి జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మంగళవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇసుకతోట జివిఎంసి ప్రాథమిక పాఠశాలను డిఇఒ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. ఏడు నెలలుగా దిద్దకపోవడాన్ని గమనించారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశిక్షణా సంస్థ ప్రిన్సిపల్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వర్క్‌బుక్స్ దిద్దకపోవడాన్ని గమినించి తక్షణమే వాటిని దిద్దాలని సూచించి వెళ్లారు. అయినా ఆ పని చేయకపోవడంతో తరగతి ఉపాధ్యాయిని కొండ, ప్రధానోపాధ్యాయులు నాగమణిపై ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజు నోటీసులు జారీచేశారు.



విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను తనిఖీ చేస్తున్న డిఇఒ చంద్రకళ

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ బిఆర్‌టిఎస్ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనం నుంచి అకస్మాత్తుగా పొగలు వచ్చి మంటలు చెలరేగాయి. వాహనంపై ఉన్న ఇద్దరూ అప్రమత్తమై ప్రాణాలు దక్కించుకున్నారు. ఆరిలోవలోని ఒక బోరింగ్ కంపెనీకి చెందిన ఇద్దరు మంగళవారం ఉదయం హోండా యాక్టివా ద్విచక్ర వాహనంపై పైనాపిల్ కాలనీ వెళ్తున్నారు. రామకృష్ణాపురం చేరేసరికి వాహనం వెనుక భాగం నుంచి పొగలు రావడం గమనించారు. వెంటనే మంటలు కూడా చెలరేగడంతో వాహనాన్ని వదిలి దూరంగా పరుగులు తీశారు. వీరు కళ్ల ముందే వాహనం దగ్ధమైంది. ప్రయాణించిన ద్విచక్ర వాహనంలో పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలు ఏవి తీసుకువెళ్లడం లేదని, వాహనంలో కూడా అర లీటరుకు మించి పెట్రోలు ఉండదని వాహన చోదకులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. దీనికి సంబంధించి సిఐ కథనం ప్రకారం... నగరంలోని గురుద్వార్ ప్రాంతానికి చెందిన బెల్గాన జగదీశ్వరరావు (81) కారుషెడ్ కూడలి జాతర సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆనందపురం నుంచి ఎండాడవైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. అతడిని స్థానికులు 108 వాహనంలో నగరంలో ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జగదీశ్వరరావు మృతి చెందినట్లు సిఐ తెలిపారు. మృతుని కుమారుడు నారాయణరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ విశ్వనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ నేల్తేరు గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బంక సురేష్ (28) మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సురేష్ పంజాబ్‌లో విధులు నిర్వహిస్తూ సంక్రాంతి పండగ నిమిత్తం గ్రామానికి వచ్చాడు. సురేష్‌కు భార్య సంధ్య, ఏడాది పాప తన్వి ఉన్నారు. మంగళవారం ఉదయం నిద్రలేచి బయటకు వెళ్తానని సురేష్ భార్యతో చెప్పాడు. టిఫిన్ కోసం భార్య సంధ్య ఫోన్ చేసినా సురేష్ స్పందించలేదు. ఈగలవానిపాలెం సమీపంలోని ఎర్ర బందచెరువు పక్కన మృతి చెంది ఉండటాన్ని పలువురు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని పక్కన పురుగుల మందు డబ్బా ఉన్నట్లు గుర్తించారు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీసు స్టేషన్ పరిధి మన్యాలపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక అప్పికొండ వీధికి చెందిన అప్పికొండ రాజా (22) మధురవాడ బజాజ్ క్రెడిట్ కార్డు ఆఫీసులో పనిచేస్తున్నాడు. మోటారు బైక్‌పై మధురవాడ వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు వృక్ష ఫౌండేషన్ ప్రోత్సాహం



క్రీడాకారులను అభినందిస్తున్న వృక్షా ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -ఆనందపురం: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మండలంలోని వెల్లంకి వృక్ష ఫౌండేషన్ ప్రతినిధులు ప్రోత్సహించి బహుమతులు అందజేశారు. జనవరి 28 నుంచి 30వ తేదీ వరకు ప్రకాశం జిల్లా దొనకొండలో 66వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. 10వ తరగతి చదువుతున్న చెల్లిబోయిన రవి మొదటి స్థానంలోనూ, మాదాబత్తుల దుర్గాభవాని, మాదాబత్తుల భవానిలు రన్నర్స్‌గా నిలిచారు. అండర్ 14 విభాగంలో హ్యాండ్ బాల్ పోటీలలో రాష్ట్రస్థాయిలో అనంతపురం జిల్లా కదిరిలో జరిగిన పోటీలలో తాతపూడి కుసుమ విజయం సాధించారు. వీరికి సహాయ సహకారాలు అందించిన వృక్ష ఫౌండేషన్ అధ్యక్షులు కాకర సురేష్ కుమార్ బహుమతులు అందజేశారు. విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చేదోడు'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ములగాడ : చేదోడు పథకాన్ని నాయీ బ్రాహ్మనులు సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కోరారు. యువజన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మల్కాపురం జోన్ అధ్యక్షులు యలమంచిలి ఈశ్వరరావు ఆధ్వర్యాన మంగళవారం గొల్లలపాలెం వాకర్స్ పార్కు వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పివి సురేష్, గులివిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీ, కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, నాయకులు ఆరిపాక పెంటారావు, వెంపటాపు నూకరాజు, నరవ పైడిరాజు, యలమంచిలి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి -ములగాడ : విశాఖ డెయిరీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆడారి ఆనంద్‌కుమార్‌ను 60వ వార్డు కార్పొరేటర్ పివి సురేష్, 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, నాయకులు దాడి సత్యనారాయణ, పిల్ల కన్నబాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, అనీల్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గీతంలో ఎఎస్ఎమ్ఇ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్ (ఎఎస్ఎమ్ఇ) విద్యార్థి విభాగాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులలో నైపుణ్యాలను పెంచడానికి ఎఎస్ఎమ్ఇ విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. గీతం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఇప్పటికే పలు ప్రొఫెషనల్ క్లబ్‌ల ద్వారా విద్యార్థులను వృత్తి పరమైన సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ప్రోత్సహిస్తోందన్నారు. విద్యార్థులు తరగతి గదులకు, పుస్తక విజ్ఞానానికి పరిమితం కాకుండా నూతన సాంకేతిక అభివృద్ధి గురించి తెలుసుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అకడమిక్ వ్యవహారాల అసోసియేట్ డైరక్టర్ డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థులు వర్క్‌షాప్‌లు, సదస్సుల ద్వారా కొత్త సమాచారాన్ని తెలుసుకొని, అవకాశాలు పెంచుకోవాలని కోరారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరక్టర్ అనీల్ కుమార్ మాట్లాడుతూ, ఎఎస్ఎమ్ఇ నిపుణుల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న మార్పులపై అవగాహన కలిగిస్తున్నారని తెలిపారు. ఎఎస్ఎమ్ఇలో సభ్యత్వం ద్వారా ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నారని, పరిశ్రమలను సందర్శించే అవకాశం, సదస్సులలో పాల్గొనే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఎఎస్ఎమ్ఇలో సభ్యులైన విద్యార్థులకు పారిశ్రామిక నిపుణులు మెంటార్‌గా ఉండి మార్గదర్శకం వహిస్తారని తెలిపారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ, పారిశ్రామిక రంగంలో డిజిటలీకరణ విప్లవాత్మకమైన మార్పులకు కారణమవుతోందన్నారు. చదివే కోర్ సబ్జెక్ట్‌పై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఎమ్ఇ భారతీయ వ్యవహరాల మేనేజర్ తానియా, అంతర్జాతీయ డైరక్టర్ మల్హోత్రా తదితరులు ప్రసంగించారు.

చేనేతను ఆదుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : చేనేత సామాజిక వర్గాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయకు చేనేత సంఘం జిల్లా అధ్యక్షులు పప్పు రాజారావు ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. చేనేతలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

ప్రజాశక్తి -ములగాడ : అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్న జివిఎంసి 40వ వార్డు పరిధి షిప్‌యార్డు కాలనీకి చెందిన గొల్లపూడి సోనియాకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.30 వేలు చెక్కును పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అందించారు. ముఖ్యమంత్రికి, ఆనంద్‌కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఆనంద్‌కుమార్, నాగేశ్వరరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 58వ వార్డులో పలు అభివృద్ధి పనులకు పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మంగళవారం శంకుస్థాపన చేశారు. గులిగిందల లావణ్య, వార్డు ప్రెసిడెంట్ గులిగిందల కృష్ణ ఆధ్వర్యాన స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ నిధుల నుంచి గుల్లలపాలెం, ములగాడ, పిలకవానిపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో రూ.3,28,93,012తో అదనపు గదుల నిర్మాణం, రూ.16 లక్షలతో సిసి రోడ్లు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. రూ.44 లక్షలతో నిర్మించిన వేమన సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాలు, ములగాడ, పిలకవానిపాలెం గ్రామంలో సిసి రోడ్లును ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసరాజు, ముకుంద్, వేమన సంక్షేమ సంఘం పిలకవానిపాలెం అధ్యక్షులు బాబూరావురెడ్డి, గొందేసి చిన సత్యనారాయణరెడ్డి, పిలక వెంకటరమణ, పిలక నరసింగరావురెడ్డి, కాకి రామకృష్ణారెడ్డి, చుక్క సత్యనారాయణరెడ్డి, దల్లి శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

విశాఖ నుంచే పాలనపై సంబరాలు



జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కెకె.రాజు తదితరులు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ నుంచే త్వరలో పాలన చేపట్టి విశాఖలోనే నివాసముంటానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పడంపై ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, వికేంద్రీకరణ ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందులో భాగంగానే విశాఖ క్యాపిటల్ రాజధానిగా ప్రకటించడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. దేశస్థాయిలో విశాఖకు గుర్తింపు లభిస్తుందని చెప్పారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, వైసిపి సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీవిశ్వనాథం, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు

ముగిసిన శారదా పీఠం వార్షికోత్సవం

సందర్శించిన ఎపి గవర్నర్

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి చినముసిడివాడలోని శారదా పీఠం వార్షికోత్సవం మంగళవారంతో ముగిసింది. రాజశ్యామల అమ్మవారి యాగం, పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. యాగ జలాలతో పీఠంలోని దేవతామూర్తుల విగ్రహాలకు స్వాత్మానందేంద్ర సంప్రోక్షణ చేశారు. రాజ్యశ్యామల అమ్మవారి యోగం పూర్ణాహుతిలో ఏపీ గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జున్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శారదాపీఠాన్ని సందర్శించిన వైవి.సుబ్బారెడ్డిని పశ్చిమ నియోజకవర్గం వైసిపి పరిశీలకులు శరగడం చిన అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలను సుబ్బారెడ్డి దృష్టికి శరగడం తీసుకెళ్లారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమించొద్దంటూ ర్యాలీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు వద్దంటూ కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు జోన్ 5 పట్టణ ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ 5 ఎసిపి రమణమూర్తి మాట్లాడుతూ, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగించడం ద్వారా ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ శ్రీలక్ష్మి, పట్టణ ప్రణాళిక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎసిపి రమణమూర్తి, టిపిఎస్ శ్రీలక్ష్మి

24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి టిపిటి కాలనీ, గాంధీనగర్, పిఎన్‌టి.కాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పదామరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో నాయకులు దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివి.రమణి, రాయుడు శ్రీను, నూకరాజు, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి సంజీవిగిరి కాలనీలో ఇటీవల సిరిపురపు సుజాత అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలును ఆమె కుమార్తెకు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా అండగా ఉంటుందన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం కింద దాదాపు 3 వేల జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ గణేష్, సెక్రటరీ బెన్విశ్వస్, వాలంటీర్ అనిల్ కుమార్, పెంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : మహాత్మాగాంధీ, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దల్లివానిపాలెంలో రక్తదాన శిబిరం, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలన్నారు. రక్తం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. శిబిరంలో పలువురు దంత పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పులి రమణారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసు, రక్తదాతలు పాల్గొన్నారు.



గోశాలలో షెడ్డును ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి

విశాఖ నుంచే పాలన

- వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-సింహాచలం: ఏప్రిల్ నెలలోపే విశాఖ నుంచి పాలన సాగించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. సింహాచల దేవస్థానానికి చెందిన కృష్ణాపురం గోశాలలో ట్రస్ట్ బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో గోవుల కోసం నిర్మించిన నూతన షెడ్డును వైవి.సుబ్బారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం ఇఒ వి.త్రినాధరావు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ట్రస్టు బోర్డ్ సభ్యులు స్వాగతం పలికారు. ముందుగా గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు జరిపాక నూతన షెడ్డును సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, పంచ గ్రామాలు, అడవివరం గోశాల, బిఆర్‌టిఎస్ సమస్యలపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా పంచ గ్రామాల భూ సమస్య కోర్టులో ఉందని, కోర్టు అనుమతులతో ఒకటి రెండు నెలల్లో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. బిఆర్‌టిఎస్ రోడ్డును త్వరలో పూర్తిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబు, దినేష్ రాజ్, కోరాడ చందు పాల్గొన్నారు

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.రాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు తమ శాఖాపరమైన వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు హాజరుకావాలని కోరారు.

6న అంగన్‌వాడీల సమస్యలపై చలో కలెక్టరేట్

విజయవంతం చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు

ప్రజాశక్తి-అనకాపల్లి, సబ్బవరం

అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 6న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. ఈ మేరకు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గారాణి, మజ్జి నాగ శేషు, గౌరవ అధ్యక్షులు జి.కుమారి అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడగా, సబ్బవరం ప్రాజెక్టు అధ్యక్షులు వివి.రమణ ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్లో ఉన్న టిఏ బిల్లు, రెండు నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పింఛను ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు చెల్లించాలని, గ్రేడు సూపర్వైజర్ పోస్టులకు వయో పరిమితి తొలగించాలని, హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి వర్కర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్ కందిపప్పు పరిమాణం పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, జాబ్ క్యాలెండర్ నిర్ణయించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, సర్వీస్ ఉండి చనిపోయిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలని, సభలు సమావేశాలు ర్యాలీలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ ఒకటి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై ఫిబ్రవరి 6న చేపట్టే నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న నాగశేషు, చిత్రంలో కుమారి, దుర్గారాణి


వైద్య శిబిరంలో పాల్గొన్న ఎస్‌పి గౌతమిశాలి, వైద్యులు

పోలీసులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎస్పీ గౌతమి శాలి పర్యవేక్షణలో హోంగార్డు నుంచి ఎస్పై వరకు విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందికి నిష్ణాతులైన వైద్య బృందంతో మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ పరీక్షలు, రక్తపోటు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశాఖ రేంజ్ డీఐజీ ఎస్ హరికృష్ణ, ఎస్పీ గౌతమి సాలి, ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్వేత మాట్లాడుతూ మహిళా పోలీసులు ఇంట్లోనూ, వృత్తిపరంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని, వారు ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లి పిల్లల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మాధురి, జిల్లా పోలీసు యూనిట్ వైద్యులు తపస్సు ఆర, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి వైద్యులు ప్రతిభ, నీరజ, ఝాన్సీ రాణి, పౌష్టికాహార నిపుణులు డాక్టర్ లావణ్య, అదనపు ఎస్పీలు బి విజయభాస్కర్, పి సత్యనారాయణ రావు, ఇన్స్పెక్టర్లు నరసింహారావు, చంద్రశేఖర్, లక్ష్మణమూర్తి, ఏవో శారద పాల్గొన్నారు.


లా వర్సిటీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

లా వర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మంగళవారం రాత్రి సందర్శించారు. న్యాయ విశ్వవిద్యాలయంలో సోమవారం కొంతమంది విద్యారిని విద్యార్థులు అస్వస్థతకు గురై విశాఖలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్ న్యాయవిశ్వవిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయం అధికారులను విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలపై ఆరా తీశారు. అధికారులు వైరల్ జ్వరాలు అని చెప్పుతున్నారని, అయితే విద్యార్థుల నుండి ఫుడ్ పాయిజన్ అయిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై వైద్యులు తేల్చి చెప్పాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, వైసీపీ నేతలు కోటాన రాము, సాలాపు వెంకటేశ్వరరావు, సబ్బవరపు ముత్యాల నాయుడు,కర్రి బాబు, సబ్బవరపు నాగభూషణం, విరోతి రామారావు, బగ్గు ఈశ్వరరావు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.

93వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఓబి గేట్ ముందు ఎనిమిది గ్రామాల నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 93వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వాడనర్సాపురం సర్పంచ్ కారే రామారావు మాట్లాడుతూ మత్స్యకారుల ఆధార్ కార్డు ఆధారంగా నేవీ గేట్ లోపల నుంచి చేపల వేటకు అవకాశం కల్పించాలని, జెట్టీ నిర్మాణం చేయాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ సమస్యలను అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఎన్నోసార్లు విన్నవించినా నేటికి అవి పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, జెఎసి పెద్దలు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నేవీ నిర్వాసితులు

మెరుగైన పరిహారం ఇవ్వాలి

నిర్వాసితుల సంఘం కన్వీనర్ బ్రహ్మాజీ



నినాదాలు చేస్తున్న రోడ్డు విస్తరణ నిర్వాసితులు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

అనకాపల్లి- అచ్చుతాపురం రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న తోటాడ రెవెన్యూ పరిధిలోని నిర్వాసితులకు మెరుగైన పరిహారం ఇవ్వాలని నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. మండలంలోని ఒంపోలు గ్రామంలో బాధిత రైతులతో మంగళవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ మంగళవారం సాయంత్రం భూములు కోల్పోతున్న బాధిత రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తానని పిలుపు ఇవ్వడంతో రైతులు నిర్వాసితులు తమ పనులను వాయిదా వేసుకుని ఎదురు చూశారని తెలిపారు. కాని ఆర్‌డిఒ గైర్హాజరు కావడం సరికాదని పేర్కొన్నారు. నిర్వాసితులందరికీ గజానికి రూ.25 వేలు చొప్పున చెల్లించాలని, నిర్వాసితుల కుటుంబంలో ఒకరికి ఎస్ఇజెడ్‌లో ఉపాధి కల్పించాలని, ఆర్ అండ్ బిలో ఉపాధి కోల్పోతున్న చిరు వ్యాపారులకు న్యాయబద్ధమైన పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించినందున రైతులు ఎక్కువగా చిరుధాన్యాల సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక అధికారి మధు తెలిపారు. మంగళవారం వారాడ గ్రామంలో ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తున్న పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అపరాల పొలంబడి, వేరుశనగ పొలంబడిని పరిశీలించి పలు సూచనలు చేశారు. పెసర, మినుము తదితర అపరాలు పూత దశలో ఉన్నాయని. ఈ సమయంలో ఒక తడి ఇవ్వాలన్నారు. 20 లీటర్ల నీటిలో 100 గ్రాముల యూరియా కలిపి పిచికారి చేస్తే పూత బాగా వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రవీంద్రనాథ్, ఏడిఏ వసంతకుమారి, పొలంబడి కోఆర్డినేటర్ చిరంజీవి, ఏవో సోమశేఖర్, వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో రెండున్నరేళ్ల జైలు

ప్రజాశక్తి-అనకాపల్లి

గతేడాది మే 10న అనకాపల్లి విజయరామరాజుపేట ప్రభుత్వ మద్యం దుకాణంలో జరిగిన దొంగతనం కేసులో ముద్దాయిలకు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డాక్టర్ హెచ్ అమర రంగేశ్వరరావు తీర్పునిచ్చారు. సదరు దొంగతనం కేసులో మద్యం షాపు సూపర్వైజర్ ఉగ్గిన భగవాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఎల్ భాస్కరరావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దొంగతనం జరిగిన మరుసటి రోజే ముద్దాయిలు బొత్స అలియా రాజు, దొడ్డి త్రిమోతీలను అరెస్టు చేసి వారి నుంచి రూ.3,41,440 నగదు, ఒక కాష్ చెస్ట్, ట్యాబ్‌ను రికవరీ చేసి, వారిని కోర్టుకు తరలించారు. ఈ కేసులో అడిషనల్ పిపి బి త్రినాథరావు కేసు వాదించినట్టు పట్టణ సీఐ డి మోహన్ రావు తెలిపారు.


విజేతలకు మెడల్స్ వేస్తున్న దాడి రత్నాకర్

క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

విద్యార్థులు చిన్నతనం నుంచి చదువుతో పాటు ఆత్మరక్షణకు, శారీరక దారుఢ్యానికి ఉపయోగపడే క్రీడల్లోనూ రాణించాలని వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ 39వ టైక్వాండో ఛాంపియన్ పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ మురళి, శేఖర్, రమేష్, సత్యదేవ్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ బొడ్డేడ లక్ష్మీ నరసింహారావు, కాండ్రేగుల చందు, దాడి ఈశ్వరరావు, ఆళ్ల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందకుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

విశాఖ డెయిరీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆడారి ఆనంద్ కుమార్‌ను మంగళవారం డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు, ఎంపీటీసీలు, పలు గ్రామాల సర్పంచులు విశాఖ డెయిరీ వద్ద కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చం నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నమ్మి అప్పలరాజు, బుచ్చయ్యపేట పిఎసిఎస్ అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, బుచ్చయ్యపేట మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


ఆనంద్‌కుమార్‌ను అభినందిస్తున్న గేదెల సత్యనారాయణ తదితరులు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి

బాలికలు స్వేచ్ఛగా ఎదగాలి

- జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

ప్రజాశక్తి -కశింకోట

సమాజంలో బాలికల స్వేచ్ఛగా ఉంటూ ఎదగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అన్నారు. స్థానిక డిపిఎన్ బాలురు హైస్కూల్‌లో స్వాబావన్ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. అనంతరం మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ 20 సంవత్సరాల వరకు బాల, బాలికలు చదువుపై దృష్టి సారించాలని, సంస్కృతి, సంప్రదాయాలు పాటించాలని సూచించారు. పిల్లలు తమ అభిప్రాయాలను తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కలగా లక్ష్మి, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజనీ, ఎంపిడిఓ కొంకి అప్పారావు, తహశీల్దారు సుధాకర్, ఎపిఎమ్ శ్రీనివాసరావు, ఎంఇఓ చిట్టిబాబు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రికి నూతన కమిటీ ఏర్పడిన నేపథ్యంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆసుపత్రి మాజీ డైరెక్టర్ విల్లూరి పైడారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్టీఆర్ వైద్యాలయానికి పూర్వ వైభవం రావాలంటే సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, పూర్తిస్థాయిలో రక్త పరీక్షలు జరగడంతో పాటు స్టాపింగ్ పాటర్న్ ప్రకారం తగిన వైద్య సిబ్బందిని నియమించాలని సూచించారు. ఎక్కువగా పేషెంట్లను విశాఖ కేజీహెచ్‌కు రెఫర్ చేస్తున్నారని, దీనివల్ల పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధిపై గత మూడేళ్లుగా ప్రకటనలు చేస్తున్నారు తప్ప రోగులకు ఎటువంటి మెరుగైన వైద్య సేవలు అందలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో నూతన కమిటీ కేజీహెచ్‌కు దీటుగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు.

గ్రామాల్లో హరిదాసుల సంకీర్తనలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : సంక్రాంతి వెళ్లిపోయినా మండలంలోని పల గ్రామాల్లో హరిదాసుల సంకీర్తనలు వినిపిస్తూనే ఉన్నాయి. గతంలో సంక్రాంతి పండగ ముందు వరకు నెల రోజుల పాటు హరిదాసులు ఎక్కువగా గ్రామాల్లో తిరుగుతూ ఉండేవారు. ప్రస్తుతం సంక్రాంతి అనంతరం కూడా గ్రామాల్లో తిరుగుతున్నారు. హరిదాసులు కానుకలు వేయమని ఆశించక వీధి లంబడి తిరుగుతూ సంకీర్తనలు వినిపిస్తూ వెళ్ళిపోతూ ఉంటారు. చూసిన భక్తులు కానుకలు తీసుకుని వెళ్తే మాత్రమే స్వీకరిస్తారు. వారి సంకీర్తనల విని వచ్చిన మహిళలు బియ్యం, నగదు వేస్తున్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేద వైద్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ లో కుష్ఠ వ్యాధి నివారణ వారోత్సవాలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య అధికారి కోనాడ లావణ్య మాట్లాడుతూ స్పర్శ, మచ్చలు, నొప్పి లేకుండా ఉంటే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షల నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎమ్ జి రజని, ఎమ్ఎన్‌వో సిహెచ్ శివకుమార్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర భూ రీ సర్వేతో రైతులకు లాభం

ప్రజాశక్తి-అనకాపల్లి : జగనన్న శాశ్వత భూ హక్కు రీ సర్వే వల్ల రైతులు ఎంతో లబ్ధి పొందుతారని చింతనిప్పుల అగ్రహారం గ్రామ సర్పంచ్ కొల్లిమల్ల గోవిందరావు అన్నారు. గ్రామంలో మంగళవారం ఆయన చేతుల మీదుగా భూ హక్కు రీసర్వే ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో తప్పులను సరి దిద్దేందుకు ఈ సర్వే ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. రీ సర్వే అనంతరం రైతులకు జగనన్న సంపూర్ణ భూహక్కు పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కోరుకొండ అచ్చియమ్మ అర్జున్ రావు, వీఆర్వో సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పండగల సీజన్.. పింఛనుదారుల్లో టెన్షన్

- తీర్థాల ఖర్చులకు పెన్షన్ సొమ్ము నుంచి వసూలుకు పలు గ్రామాల్లో తీర్మానాలు
- ఆందోళనలో లబ్ధిదారులు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట

మండలంలో పలు గ్రామాల్లో పండగలు, తీర్థాలు జరుగుతుండడంతో పింఛనుదారుల్లో టెన్షన్ పట్టుకుంది. తీర్థాల వల్ల పింఛనుదారుల్లో టెన్షన్ ఎందుకని అనుమానం రాకపోదు. నేడు ఈ తీర్థాలు, పండగలకు అయ్యే ఖర్చులను పింఛనుదారుల నుంచి వసూలు చేయాలని పలు గ్రామాల్లో తీర్మానాలు చేయడమే ఈ ఆందోళనకు కారణం.

గ్రామాల్లో సంక్రాంతి అనంతరం దేవుళ్ళ, గ్రామదేవతలు, పేరంటాళ్ల పేరుతో పండగలు, తీర్థాలు ఘనంగా నిర్వహిస్తూ ఉంటారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి వాటితో పాటు విద్యుత్ దీపాలంకరణలు ఆయా గ్రామాల ఆర్థిక పరిస్థితులను బట్టి ఏర్పాటు చేస్తూ ఉంటారు. అయితే గత నాలుగేళ్లుగా గ్రామాలకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. గతంలో గ్రామాలకు మద్యం బెల్టు షాపుల ద్వారా ఆదాయం సమకూరేది. దీంతో పండగలు, తీర్థాల ఖర్చులకు లోటుండేది కాదు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అధికారిక బెల్టు షాపులు లేకపోయినా పాన్ షాపులు, టీ దుకాణాల వద్ద మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కాని గ్రామాలకు రూపాయి కూడా ఆదాయం రావడం లేదు. దీంతో గ్రామాల పెద్దలు పండగలు, తీర్థాలకు అయ్యే ఖర్చులను పింఛనుదారుల నుండి వసూలు చేసుకోవడానికి గ్రామ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల రెండో వారంలో జరగనున్న ఆంజనేయ స్వామి తీర్థానికి ఒక్కొక్క పింఛనుదారుని నుండి రూ.500 వసూలు చేయాలని మండలంలోని మంగళాపురం గ్రామ పెద్దలు తీర్మానించడంతో ఆ విషయం కాస్త పత్రికలలో వచ్చింది. దీంతో మండల స్థాయి అధికారులు స్పందించి వసూలు చేస్తే చర్యలు కఠినంగా తీసుకుంటామని హెచ్చరించడంతో ఆ గ్రామ పెద్దల వెనక్కు తగ్గారు. అయితే పలు గ్రామాల్లో రూ.1000 కూడా వసూలు చేయాలని తీర్మానాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈనెల 7న మండలంలోని 7, 8 గ్రామాల్లో పండగలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సైతం పింఛనుదారులు, రేషన్ కార్డులదారుల నుండి డబ్బులు వసూలుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీంతో పింఛనుపై ఆధారపడి జీవిస్తున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అపరాల సాగుపై రైతులు శ్రద్ధ చూపాలి



అపరాల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి- సబ్బవరం

అపరాల పంటల సాగుపై రైతులు శ్రద్ధ చూపాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు కోరారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం, అయ్యన్నపాలెం గ్రామాలను మంగళవారం సందర్శించి క్షేత్రస్థాయిలో రబీ సీజన్లో రైతులు వేసుకున్న పంటల సరళని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో వరి పంట కోసిన తర్వాత భూములు ఖాళీగా ఉంచకుండా ఆరుతడి పంటలైన అపరాలను, చోడి (రాగి), నువ్వు పంటలను సాగు చేసుకుని మంచి దిగుబడులు పొందాలని సూచించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా ఈ- పంటలో నమోదు చేయాలని, ఈకేవైసీ చేయించాలని ఆదేశించారు. నువ్వు, అపరాల పంటలపై వచ్చిన తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు గురించి రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంఎస్ వసంత కుమారి, మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ సబ్బవరపు బుజ్జి, వ్యవసాయ సిబ్బంది జానకి, రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-అనకాపల్లి



సమ్మేళనంలో పాల్గొన్న ఎఎంఎఎల్ కళాశాల పూర్వ విద్యార్థులు

చిన్ననాటి మిత్రులు ఒక దగ్గరికి చేరాలంటేనే కేరింతలు, కౌగిలింతలు, ముచ్చట్లు, పరామర్శలు ఇలా సాగిపోతుంటాయి. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో 1978-81 సంవత్సరంలో బీఎస్సీ చదివిన విద్యార్థులు మంగళవారం స్థానిక జార్జ్ క్లబ్లో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. కుశల ప్రశ్నలు, జీవితంలో సాధించిన అంశాలు, సంతోషాలు బాధలు ఒకరికొకరు పంచుకున్నారు. నాటి మధుర స్మృతులతో రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఉపాధ్యాయులుగా, డాక్టర్లుగా లాయర్లుగా, కాంట్రాక్టర్లుగా చాలామంది బెంగళూరు, హైదరాబాదులో స్థిరపడ్డారని, కొంతమంది విదేశాల్లో తమ పిల్లలతో ఉంటున్నట్టు తెలుసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి నడుం బిగించిన పివీ సుబ్బారావు, చెంచయ్య, వి లక్ష్మి, ఉషా కిరణ్, అరుణ వరలక్ష్మిలను అభినందించారు. ప్రతి ఏటా కలుసుకునేందుకు మిత్ర బృందం తీర్మానించుకున్నట్టు తెలిపారు.

2న గ్రహణం మొర్రిపై ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : అనకాపల్లి గౌరీ గ్రంథాలయంలో ఫిబ్రవరి 2వ తేదీన గ్రహణం మొర్రి, గ్రహణ శూలకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్రం ఉపాధ్యాయురాలు సుమతి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బసవతారకం స్మైల్ ట్రైన్ (బిఎస్‌టిసి), ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య సేవలు బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరు నెలల ప్రాయం నుండి 60 సంవత్సరాల వయస్సు గలవారికి వారిలో ఉన్న లోపాలను పూర్తిగా సరిచేసి, ఆపరేషన్ తరువాత మాట్లాడటంలో శిక్షణ, దంతాల అమరిక సరిచేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

5 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని తామరబ్బ పంచాయితీ పరిధి ముకుందపురం, కొత్త బొడ్డపాడు గ్రామ శివారున డ్యామ్‌కి ఆనుకొని నాటసారా బట్టీలు ఉన్నాయని, ముందస్తు సమాచారంతో స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర మంగళవారం తన సిబ్బంది రాము, గౌరి నాయుడు, సూరిబాబు సహకారంతో నాటు సారా బట్టిలపై దాడి చేశారు. సుమారు 5000 లీటర్ల నాటుసారా పులుపును ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు.

దత్తాత్రేయను కలిసిన యాదవ సంఘం నాయకులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : హిమాచల్ ప్రదేశ్ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయను జిల్లా యాదవ సంఘం నాయకులు మండల ఎంపీటీసీలు ఫొరం అధ్యక్షులు దేవర అప్పారావు యాదవ్, సాన బోయినగోవింద్ యాదవ్ సోమవారం విశాఖపట్నం గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదవుల జీవనస్థితిగతులు, తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

ఉమామహేశ్వరిదేవి తీర్థం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో ఫిబ్రవరి 1నుంచి 5 వరకు జరుగు ఉమామహేశ్వరి దేవి తీర్థ మహోత్సవం వాల్ పోస్టర్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఉమామహేశ్వరి దేవి కళ్యాణ మహోత్సవం బుధవారం రాత్రి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఐదు రోజులు అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

5న దేవరాపల్లి బస్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకున్న దేవరాపల్లి బస్టాండ్‌ను ఫిబ్రవరి 5న ప్రారంభించనున్నట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తెలిపారు. అధ్వాన స్థితిలో ఉన్న బస్టాండ్‌ను ప్రత్యేక నిధులతో సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. మంగళవారం ఆయన మరుగుదొడ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైసిపి నాయకులు బూరె బాబురావు, వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వేచలపు అప్పలనాయుడు. పేరు నాయుడు, వాలేటి నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని చిట్టి పాలెం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులను స్థానిక జెడ్పిటిసి సభ్యులు దొండా రాంబాబు మంగళవారం ప్రారంభించారు. కొండప్రాంతం నుండి చెక్ డాం వరకు ఈ నిర్మాణాలను చేపడుతున్నట్లు ఉపాధి హామీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అబ్బాస్, మండల కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, పోలేపల్లి సర్పంచ్ సీతా పైడినాయుడు, రాజాం ఎంపీటీసీ మరిసా రమణ, తైపురం మాజీ సర్పంచ్ డేగల అప్పారావు, పొట్టి దరపాలెం ఉప సర్పంచ్ గుద్దేటి శ్రీను, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలో పలు ప్రాంతాల్లో తుప్పు పట్టిన, దెబ్బతిన్న ఇనుప స్తంభాలను పునరుద్ధరించనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రమణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోట్ని వీధి, తాకాసి వీధి, కరణాల వీధి, పెరుగు బజారు, చిన్న వీధి, చేపల బజారు, వుడ్ పేట, నాయుళ్ల వీధి, చోడవరం బస్ స్టాప్ ప్రాంతం, నరసింగరావుపేట, న్యూ బర్మా కాలనీ, చవితిన వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వైవి.సుబ్బారెడ్డి సహకారంతోనే మైనింగ్ దోపిడీ

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి కనుసన్నల్లోనే మైనింగ్ దోపిడీ జరుగుతుందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లడుతూ, మైనింగ్ కు సంబంధించి హైకోర్టులో కూడా కేసు పెండింగ్లో ఉందన్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల అధికారులు స్పందించకపోవడంతో కొన్ని కోట్ల విలువైన ఖనిజ సంపదను కొంత మంది పెద్దల ఆధ్వర్యంలో దోచుకుపోతున్నారన్నారు. నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం సరుగుడు పంచాయతీ సుందరకోట సమీపంలో పన్నెండున్నర ఎకరాల మైనింగ్ దోపిడి జరుగుతుందన్నారు. ఇదంతా టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ఆశీస్సులతో అక్కడ ఉ న్న కొంత మంది పెద్దలు దోపిడి చేస్తున్నారన్నారు. హెవీ పొక్లెయిన్తో సుందరకోటలో మైనింగ్ తవ్వకాలకు ప్రయ త్నాలు చేస్తే గ్రామస్థుల ఒదరూ అడ్డుకున్నారన్నారు. అయినా అధికారులు పట్టించు కోకపోవడం సమంజసం కాదని అయ్యన్న విమర్శించారు.





సర్వే చేస్తున్న అధికారులు

చినదొడ్డిగల్లులో సర్వే

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామంలోని బద్ది వీధిలో మురుగునీటి సమస్యకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం సర్వే చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. మండల సర్వేయిర్ మూర్తి రోటర్ ద్వారా సర్వే చేశారు. ఇంటి యజమానులు జిరాయతీలో నిర్మించుకున్న ఇంటి నుండి గ్రామ కంఠంకు సంబంధించిన స్థలం అక్రమంగా ఆక్రమించినట్లు గుర్తించామని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. దీంతో డ్రైనేజీలు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. ఆక్రమణదారులకు సంబంధించి హక్కు పత్రాలను పంచాయతీ కార్యాలయానికి తీసుకు రావాలని నోటీసులు జారీ చేస్తామని, స్పందించకుంటే పోలీసులు సహాయంతో ఆక్రమణలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ తీర్థ మహోత్సవం సందర్భంగా మండల స్థాయి ఎడ్లబండ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కొత్తకోట ఎస్సై విభూషణరావు ప్రారంభించగా గెలుపొందిన కోసిరెడ్డి మహేష్, దుప్పట్ల శ్రీను, కొర్రా అప్పారావు లకు విజేతలకు స్థానిక వైసిపి నాయకులు శీలం శంకర్రావు, గుమ్మడి దొరబాబు, జనపరెడ్డి బాబురావు, అడపా శంకర్రావు తదితరుల ఆర్థిక సాయంతో మొదటి బహుమతి రూ.4 వేలు, రెండవ బహుమతి రూ.2 వేలు, మూడవ బహుమతి రూ. 1500 అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపిటిసి సభ్యులు కె.లక్ష్మి శంకర్, మాజీ సర్పంచ్ కోట నీలవేణి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల:సంకపూరు గ్రామంలో మంగళ వారం నల్ల మారమ్మ అమ్మవారి పండుగ ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారిని అనుకుని ఉన్న నలమరమ్మ గుడికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సంబరాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సబ్బవరం:మండలంలోని ఆరిపాక పంచాయితీ శివారు పెదయాత పాలెం గ్రామంలో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీలక్ష్మిరాణి రాము ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దంపతులు ఆంజనేయ స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుండి కుంకుమ పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శరగడం వెంకటరావు వైసీపీ నేతలు శరగడం అప్పల నాయుడు, కాళ్ళ చంద్రరావు, కాళ్ళ శ్రీనివాసరావు, రాపేటి తేజ, శరగడం కోటేశ్వరరావు, ఆడారి వెంకీ,బొడ్డేటి యోగి, శ్రీను, రాపేటి జగన్నాధం, పొలమేరశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : జి.భీమవరంలో మంగళవారం శ్రీగంగా దేవి అమ్మవారు పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం లోవరాజు, సర్పంచ్ హనుమంతు వెంకట లక్ష్మణరావు, ఎమ్పిటిసి అల్లం శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎస్.పేటలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి 14వ తీర్థ మహోత్సవం జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ మలసాల కిషోర్, మాజీ సర్పంచ్ మలసాల అనురాధ ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరము భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

తీర్థానికి భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు మోద కొండమ్మ తీర్థ మహోత్సవం ఈనెల ఐదవ తేదీన నిర్వహిస్తుండగా దీనికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా అదే రోజు పడాల అప్పలనాయుడు కృష్ణవేణి దంపతుల ఆర్థిక సాయంతో అన్న సమారాధన నిర్వహిస్తారు. సాయంత్రం రేసు గుర్రాల పరుగు పోటీలు, ఎడ్ల బండ్ల పరుగు పందేలు, ముగ్గులు పోటీలు నిర్వహిస్తారు. రాత్రి డాన్స్ బేబీ డాన్స్ ఏర్పాటు చేస్తారు.పరుగు పందేలకు సంబంధించి స్థలాన్ని మంగళవారం చదును చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, పిఏసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్, మాజీ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మ తీర్థం ఈనెల 5వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు పర్యవేక్షణలో గ్రామ పెద్దలు సోమవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేశారు. తీర్థ మహోత్సవానికి తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజేష్, మాజీ అధ్యక్షులు పడాల అప్పలనాయుడు, చింత మూర్తి, పడాల అప్పలరాజు, జగదీష్ పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి



పుస్తకాలు పరిశీలిస్తున్న గ్రంథాలయాధికారి, పాఠకులు

గ్రంథాలయానికి చేరిన పుస్తకాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:గ్రంథాలయానికి సరికొత్త నూతన పుస్తకాలు వచ్చాయని లైబ్రేరియన్ దమయంతి తెలిపారు. ఆమె మంగళవారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక గ్రంథాలయంనకు 1262 పుస్తకాలు సరఫరా చేసారని, వీటిలో తెలుగు 1072, ఇంగ్లీష్ 141, హిందీ 49 పుస్తకాలు ఉన్నాయని తెలిపారు.కొత్త పుస్తకాలను పాఠకులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, విశ్రాంత గ్రంథాలయం అధికారి మురళీకష్ణ, తదితరులు పాల్గొన్నారు.



నగదును ఇస్తున్న పైలా ప్రసాదరావు

విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: గత నెల 29న రేవుపోలవరం తీరంలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యమైనట్లు బంధువులు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకి తొండంగి మండలం వేమవరం సముద్ర తీరంలో గుర్తించి మెరైన్ పోలీసులు పోలీసులకు సమాచారమందించారు. నర్సీపట్నం అయ్యన్న కాలనీకి చెందిన కొమ్మోజు రేవంత్ (15) అలల ఉధృతికి గల్లంతయ్యాడు. స్థానిక పోలీసులు పోస్ట్ మార్టం నిమిత్తం రేవంత్ మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని పోలీసుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

3న అడవి రాజుబాబుల పండగ

ప్రజాశక్తి-గొలుగొండ: కేడిపేటలోని అల్లూరి పార్కు వద్ద గల అడవి రాజుబాబుల ఆలయంలో ఈనెల 3న పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త కొమ్మనాపల్లి రామారావు తెలిపారు. పండుగకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పండుగను విజయవంతం చేయాలని కోరారు.

బాధితులకు రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - చీడికాడ :మండలంలోని దండి సురవరం గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన టిడిపి కార్యకర్త ఏడువాక కొండబాబును మాడుగుల నియోజవర్గ టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు పరామర్శించారు. ప్రసాద్రావు ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని వైద్య ఖర్చులు నిమిత్తం 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పిఏసిఎస్ మాజీ సభ్యులు చిరుత పరదేశి కుటుంబాన్ని పైలా ప్రసాదరావు పరామర్శించి 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పైలా నాయుడు, పైలా యువసేన సభ్యులు గర్రెడ్డి కొండలరావు, చీడికాడ మండలం టిడిపి ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, ఎంపీటీసీ దారపు పెద్ద నాయుడు పాల్గొన్నారు.

భారత నిర్మాణ సేవా ట్రస్ట్‌కు అవార్డు

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలోని భారత నిర్మాణ సేన సేవా ట్రస్ట్‌కు అరుదైన పురస్కారం దక్కింది. విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్‌ను హైదరాబాద్‌లో బహూకరించారు. మాడుగులలో భారత నిర్మాణ సేన సేవా ట్రస్ట్ గత కొద్ది సంవత్సరాలు గా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, మన్ననలు పొందుతుంది. ఈ సంస్థ సేవా కార్యక్రమాలకు దేశ స్థాయిలో అవార్డ్ లభించింది. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మి నారాయణ చేతుల మీదుగా అవార్డ్ స్వీకరించారు. దేశం నలు మూలల నుండి 3 వేల సంస్థల పనితీరు పరిశీలించి 300 సంస్థలకు ఇండియన్ ఐకాన్ అవార్డులు అందజేసినట్టు విశ్వ గురు వరల్డ్ రికార్డ్స్ సిఈఓ సత్యవోలు రాంబాబు తెలిపారు. అవార్డ్‌ను ట్రస్ట్ సభ్యులు గౌరీ పట్టపు మహేష్, బుచ్చయ్య చౌదరి, సాయికుమార్ తదితరులు స్వీకరించారు ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మాడుగుల లో ట్రస్టు గౌరవ అధ్యక్షులు శ్రీనాథ్ శ్రీనివాసరావు, సభ్యులు ఈశ్వరరావు నాగు, తాళ్లపురెడ్డి నాగచంద్ర, కుంచా మధు రామ్‌కి కుక్కర్ మోదకొండ సూరిబాబు తదితరులు అవార్డు అందించిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆవార్డు స్వీకరిస్తున్న సభ్యులు

ఆలయానికి మైక్ సెట్ వితరణ

ప్రజాశక్తి-రోలుగుంట:శరభవరంలోని హనుమాన్ ఆలయానికి అదే గ్రామానికి చెందిన నర్సీపట్నంలోని సెల్‌షాప్ మేనేజర్ కోటిపల్లి రాజా రూ.30వేల విలువ గల మైక్ సెట్‌ను ఆలయ కమిటీ సభ్యులకు వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు ఆలయంలో భక్తి గీతాలు ప్రజలకు వినిపించే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ పండుగలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించేం దుకు వీలుగా మైక్ సెట్‌ను ఉపయోగించాలని ఆలయ కమిటీ సభ్యులను కోరారు.



మైక్ సెట్‌ను ఇస్తున్న దాతలు

రసాభాసగా మున్సిపల్ సమావేశం

సిఎం సభకు అనవసర ఖర్చులపై నిలదీసిన సభ్యులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నంలో సీఎం సభల పేరుతో ప్రజల సొమ్ము దుర్వినియోగం చేశారని మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశంలో మొట్టమొదటగా అజెండా చదివి వినిపించారు. కౌన్సిలర్ పద్మావతి ప్రశ్నలు సందించడంతో సభ రసాభాసగా మారింది. ప్రతిపక్ష నేతలు ధ్వజమెత్తడంతో సమాధానం చెప్పలేని అధికారులు నీళ్లు నమిలారు. స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి నుండి రోడ్డు వేస్తున్నామని చెప్పడంతో చింతకాయల పద్మావతి ప్రశ్నిస్తూ గత ప్రభుత్వంలో ఈ రోడ్డు మంజూరు అయిందని, మరలా మంజూరు చేసినట్లు ప్రత్యేకంగా చెప్పడం ఏంటని ప్రశ్నించారు. సీఎం మీటింగ్ పేరిట రూ.12 లక్షలతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పి దుర్వినియోగం చేశారన్నారు. డ్రైనేజీలు, రోడ్లు బాగు చేసేందుకు నిధులు లేవని చెప్పి ఇటువంటి అనవసరపు ఖర్చులు ఏమిటని ప్రశ్నించారు. సీఎం సభకు 10 లైట్లు ఏర్పాటు చేసేందుకు రూ.49000 ఖర్చు చేశారని, అవి కొంటే ఐదు వేలు కంటే ఎక్కువ ఉండవన్నారు.దీనికి మునిసిపల్ కమిషనర్ సమాధానం అధికారికంగానే ఖర్చు చేశామని, ఎటువంటి దుర్వినియోగం జరగలేదని తెలిపారు. వైసిపి కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, సీఎం సభలకు ఖర్చులు చేస్తే తప్పేంటని, ఆనాడు ధర్మ పోరాట దీక్షతో 2014లో దొంగ దీక్షలు చేసి లక్షల రూపాయల దుర్వినియోగం చేశారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు చూపించేందుకు కొన్ని లక్షల దుర్వినియోగం చేశారని విమర్శించారు. జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య ప్రశ్నిస్తూ కోవిడ్ సమయంలో తరలించిన మార్కెట్‌ను డిగ్రీ కాలేజీ సమీపంలో రోడ్డుపై పెట్టడంతో వాహనదారులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ మార్కెట్ ను ఇందిరా మార్కెట్ కు తరలిస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. కోవిడ్ ప్రభావం లేనప్పటికీ మార్కెట్ కొనసాగించడంపై ఆంతర్యం ఏమిటో అర్థం కాలేదని తెలిపారు. ఉత్తరవాహిని తీరమందు దేవాలయానికి వెళ్లే దారిలో లైట్లు వేసిన మరుసటి రోజునే పోతున్నాయని, వీటిపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తులే దొంగతనం చేస్తున్నట్లు అనిపిస్తుందనికౌన్సిలర్ శెట్టి బాబులు అధికారులను నిలదీశారు. కౌన్సిలర్ శ్రీకాంత్ ప్రశ్నిస్తూ మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారులపైనే ప్రతాపం చూపించడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. చైర్ పర్సన్ ఆదిలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ, సీఎం సభకు నిధులు దుర్వినియోగం జరగలేదని, వచ్చిన ప్రజలకు ఆహార పొట్లాలు, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు.



ప్రశ్నిస్తున్న పద్మావతి, (ఇన్‌సెట్‌లో చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి)



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

425వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో రెండవ పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా మంగళవారం నాటికి 425వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ కంపెనీ వ్యర్థ రసాయన జలాలను సముద్రంలోకి వదలడంతో ఈ ప్రాంతంలో మత్స్య సంపద నశించి తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వేట సాగకపోవడంతో చాలామంది మత్స్యకార కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలసలు పోవడం జరిగిందన్నారు. రెండవ పైప్ లైన్‌కు కూడా అనుమతులు ఇస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండవ పైప్ లైన్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులంతా ఐక్యంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసిపిల్లి నూకరాజు, గోసల సోమేశ్వరావు, పిక్కి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డి

సంపద తయారీ కేంద్రం పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లిలో చెత్త నుండి సంపద తయారీ శిక్షణా కేంద్రం నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్డి వెంకట నారాయణ పరిశీలించారు. నక్కపల్లిలో ఏర్పాటు చేస్తున్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా అధికార యంత్రాంగం శిక్షణా కేంద్రంగా ఎంపిక చేసింది. పలు మండలాలకు సంబంధించి చెత్త నుండి సంపద తయారీపై ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. షెడ్డుకు సంబంధించిన మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు సూచించారు. శిక్షణా కేంద్రం ఆవరణలో నాటిన మొక్కలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీసం రాజు పాల్గొన్నారు.

దళితుల నిరసన

ప్రజాశక్తి-మాకవరపాలెం: తమ సొంత స్థలంలో ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద దళిత కుటుంబ సభ్యులు నిరసన చేపట్టారు. గిడుతూరు గ్రామానికి చెందిన మట్ల రాజులమ్మ అదే గ్రామంలో 17 సర్వే నెంబర్లు ఉన్న ఇంటి స్థలంలో గత 30 సంవత్సరాలుగా నివాసం ఉంటుం. ప్రతి రెండు సంవత్సరానికి ఒకసారి ఇంటికి కొత్తగా తాటిఆకు కమ్మలు మార్చుతూ ఉండేది. ఈ నేపథ్యంలోనే పాత ఇంటిని పూర్తిగా తొలగించి కొత్త ఇంటి నిర్మాణం కోసం పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులతో పాటు సర్పంచ్ ఇల్లు కట్టడం కుదరదని అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా కలెక్టరుకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపింది. దీంతో చేసేది లేక మంగళవారం కట్టు బట్టలతో పాటు వంట సామాగ్రి తీసుకొని తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు.



ఆందోళన చేపడుతున్న దళితులు

ఎంవిపి రైతు బజార్‌పై నీలినీడలు

వేరే చోటుకు తరలిస్తారన్న ప్రచారంతో పలువురిలో ఆందోళన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ



ఉదయం లేచింది మొదలు ఉరుకుల, పరుగుల జీవితం. రోజు మొత్తం ఒత్తిడితోనే మనకు తెలియకుండా గడిపేస్తున్నాం. ఇంత ఒత్తిడిలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తాజా కూరగాయలు, ఆకుకూరలు ఎంతో అవసరం. వాటిని అందించేవే రైతు బజార్లు, అందులో నగరంలోని ఎంవిపి.రైతు బజారు ముఖ్యమైనది. ఎక్కడెక్కడివారో ఇక్కడకు వస్తారు. తాజాగా ఇక్కడి రైతు బజార్‌పై నీలినీడలు అలుముకున్నాయి. రైతు బజారును తరలిస్తారని, రైతులను వేరే బజారుకు మారుస్తారనే వార్త పట్ల అందరూ ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలు ఇక్కడే వంటా వార్పు చేసుకుంటూ గిరి శిఖర గ్రామాల నుండి గిరిజన ఉత్పత్తులను సేకరించి ఇక్కడే అమ్మకాలు చేస్తూ జీవిస్తున్నారు. వారూ ఆందోళనకు గురవుతున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 1800 రైతు కుటుంబాలు ఈ రైతు బజారుపై ఆధారపడి జీవిస్తున్నాయి. అధికారులు, ప్రభుత్వం ఏం ఆశించి ఇంతటి నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకుంటున్నారో అర్థం కావట్లేదని పలువురు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇప్పటికే చాలా నష్టపోతున్నామని, రైతు బజారు మూసేస్తే తమ పొట్టగొట్టినట్లేనని పలువురు 'ప్రజాశక్తి' ఎదుట వాపోయారు. తామేదో ఈ రైతు బజార్లలో సరుకులు అమ్మి పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించి గుత్తేదారులుగా మారిపోయినట్లుగా కొన్ని పత్రికలు అదే పనిగా రాయడం, వాటిని అధికారులు గుడ్డిగా అనుసరించడం పరిపాటిగా మారిపోయినట్టు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఉచితంగా ఇచ్చిన స్టాళ్లకు ఇప్పుడు ప్రతినెలా అద్దె చెల్లిస్తున్నామని తెలిపారు. రైతు బజారును కొనసాగించాలని కోరారు.

బాక్సింగ్ పోటీలకు తేజస్విని

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: ఈనెల 1 నుండి 5వ తేదీ వరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన భోపాల్, మధ్యప్రదేశ్లో జరగనున్న ఖేలో ఇండియా యూత్ బాక్సింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీం తరపున సీనియర్ బాక్సర్ యర్రా తేజస్విని 75 కేజీల విభాగంలో యూత్ విమెన్ కేటగిరిలో ఆడుతున్నారని స్థానిక శాప్ కోచ్ అబ్బు తెలిపారు. విమెన్ బాక్సర్ మెడల్ తీసుకు రావాలని నింజాస్ అకాడెమి డైరెక్టర్స్ ఆకాంక్షించారు. ఆమెను అకాడెమీ డైరెక్టర్స్ వెలగా నారాయణరావు, జగన్నాథం, పారుపల్లి శ్రీనివాసరావు, సైకాలజిస్ట్ సుమ, అడిగర్ల సతీష్, బోళెం శివ తదితరులు అభినందించారు.



తురువోలులో ర్యాలీ

ప్రజాశక్తి- చీడికాడ: మండలంలో తురువోలు గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వాభిమాన్" కార్యక్రమంలో భాగంగా, మహిళా పోలీస్, ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయొద్దన్నారు. రక్తహీనతకు గురి కాకుండా ఆరోగ్యం పట్ల దృష్టి వహించాలని, పౌష్టికాహార ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

కన్వీనర్లు, గృహసారథుల నియామకం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో మంగళవారం పలు సచివాలయాలకు సచివాలయ మండల కన్వీనర్ పాణి శాంతారాం, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో పంచాయతీల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులను నియమించారు. చీడిగుమ్మల-2 సచివాలయల పరిధిలో 80, పుత్తడిగైరంపేట-20, ఏటిగైరంపేటలో 30 మంది గృహ సారథులను నియమించడం జరిగిందని, నాలుగు సచివాలయాలకు ముగ్గురు చొప్పున 12 మంది కన్వీనర్లను ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామ పెద్దలు సమక్షంలో ఎంపిక చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చీడిగుమ్మల పిఎసిఎస్ అధ్యక్షులు రామకృష్ణ, ఉప సర్పంచ్ కె.సత్యనారాయణ, పుత్తడి గైరంపేట సర్పంచ్ పత్తి రమణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.



నియామక పత్రాలు స్వీకరిస్తున్న కన్వీనర్లు

జిల్లాలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి- కోటవురట్ల: జిల్లాలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ డిఈఓ ప్రేమ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన కోటవురట్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు దాదాపు 42 వేల మంది ఉన్నట్లు తెలిపారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం పాఠశాలలో అన్ని వసతులు కల్పించామని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు స్టడీ మెటీరియల్ సహా క్లాస్ రూమ్ లో చదువుకునేందుకు వీలుగా విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు అమర్చడంతో పాటు పరిశుభ్రమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఉపాధ్యాయులపై వ్యక్తిగత కక్ష సాధింపు లేదని, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన తరగతి గదిలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆయనతో పాటు ఎంఈఓ అప్పారావు, ప్రధానోపాధ్యాయులు ఏసుదాసు పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డిప్యూటీ డిఇఒ

చోరీ నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -కోటవురట్ల: కైలాస పట్నం గ్రామంలో గతేడాది 11వ నెలలో సిద్ధబత్తుల పోతురాజు ఇంట్లో జరిగిన బంగారం దొంగతనం చేసిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై నారాయణరావు తెలిపారు, అదేవిధంగా ఒక జూవైనల్ షాపు వ్యక్తిని అదుపులోకి తీసుకోవడంతో పాటు పట్టుపడ్డ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.